**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న **'జర్నలిస్ట్ ఫైల్'** దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467

మంగళవారం 25.06.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక - 142 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00

## మళ్ళీ మంచి రోజులు వస్తాయి : వైఎస్ జగన్

- ముగిసిన మూడు రోజుల పులివెందుల పర్యటన
- హెలికాప్టర్‌లో బెంగుళూరుకు పయనం



**కడప ( జర్నలిస్ట్ ఫైల్ ) :** చెప్పిన మంచి పనులన్నీ చేశాం.. రాష్ట్రంలో ప్రతీ కుటుంబంలో మనం చేసిన మంచి ఉంది, అందుకే ప్రజలకు మన పైనే విశ్వాసం ఉందన్నారు వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి. మూడు రోజుల పాటు సొంత నియోజకవర్గం పులివెందుల పర్యటించిన ఆయన.. భవిష్యత్ కార్యాచరణలో భాగంగా పార్టీ శ్రేణులకు పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. "ఎవరూ అధైర్యపడొద్దు, రాబోవు కాలం మనదే, ప్రతి కుటుంబంలో మనం చేసిన మంచి ఉంది, మనపట్ల ప్రజలకు విశ్వాసం ఉంది, భవిష్యత్ మనదే. నిరంతరం ప్రజాశ్రేయస్సుకు అనుగుణంగా మన పార్టీ శ్రేణులు అడుగులు వేయాలి. కష్టాలను ధైర్యంగా ఎదుర్కొందాం, మళ్ళీ మంచి రోజులు వస్తాయి" అని వైఎస్ జగన్ అన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా.. మూడు రోజులపాటు భాకరాపురంలో ఉన్న క్యాంపు కార్యాలయంలో కార్యకర్తలు, ప్రజలు, నేతలు, అభిమానులతో జగన్ మమేకమయ్యారు. అందరినీ పేరుపేరునా పలకరించి వారి

2 లో

## ప్రైవేటు విద్యా సంస్థలలో 25 శాతం ఉచిత సీట్ల జీవోను రద్దు చేసిన హైకోర్టు

వివరాలు 4 లో

## 45 రోజుల పాటు.. 26 రైళ్ళు రద్దు..



**రాజమండ్రి( జర్నలిస్ట్ ఫైల్ ) :** రైల్వే అధికారులు సోమవారం నుంచి 45 రోజులపాటు 26 రైళ్లను రద్దు చేశారు. రద్దు చేసిన వాటిలో రత్నాచల్, జన్మభూమి , సింహాద్రి , సర్కార్ ఎక్స్‌ప్రెస్ సహా డిమాండ్ ఉన్న రైళ్లను అధికారులు రద్దు చేశారు. దీంతో విజయవాడ , విశాఖ , తిరుపతి , హైదరాబాద్ వెళ్లేవారికి తీవ్ర ఇబ్బందులు కలగనున్నాయి. ఆకస్మికంగా రైళ్ల రద్దు చేయడంపై రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణికులు మండిపడుతున్నారు. ఒక్క రాజమండ్రి రైల్వే స్టేషన్ నుంచి ప్రతి రోజూ 30 వేల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ప్రత్యామ్నాయంగా ఇంటర్ సిటీ రైళ్లు నడపాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి రైళ్ల రద్దు సమస్యపై స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు. కాగా కడియం - నిడదవోలు మధ్యరైల్వేట్రాక్ ఆధునీకరణ కోసం ఆగస్టు 10వ తేదీ వరకు నెలన్నర పాటు రైళు రద్దు చేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.




- సంక్షేమమే ప్రాధాన్యంగా తొలి మంత్రివర్గ సమావేశం
- మెగా డీఎస్సీ, ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దు
- సచివాలయ సిబ్బంది చే ఇళ్ల వద్దే పెన్షన్ల పంపిణీ
- పేదోడి కడుపు నింపేందుకు అన్నా క్యాంటీన్ల పునఃప్రారంభం
- హెల్త్ యూనివర్శిటీకి తిరిగి ఎన్టీఆర్ పేరు
- గంజాయి నివారణకు ఐదుగురు సభ్యులతో కేబినెట్ సబ్ కమిటీ
- పంచాయతీ, మున్సిపాల్టీల్లో పారిశుద్ధ్య పనులను తక్షణమే ప్రారంభించేందుకు మంత్రి మండలి నిర్ణయం

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన తొలి మంత్రివర్గ సమావేశం ఈరోజు జరిగింది. ఈ భేటీలో పలు కీలక నిర్ణయాలపై చర్చించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చేసిన ఐదు సంతకాలకు కేబినెట్ ఆమోదించింది. అయితే కేబినెట్ భేటీలో చర్చించిన విషయాలను మంత్రి కొలుసు పార్థసారథి వెల్లడించారు. తొలి కేబినెట్ సమావేశం జరిగిందని.. ప్రజలకు భరోసా కల్పించే ప్రభుత్వం వచ్చిందని తెలిపారు. మెగా డీఎస్సీపై నిర్ణయం కేబినెట్లో నిర్ణయించామని చెప్పారు. ఉపాధ్యాయుల నియామకాన్ని వైసీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని.. కానీ టీచర్ల నియామకానికి చంద్రబాబు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు.

16,347 పోస్టులతో భర్తీ చేస్తామని తెలిపారు. ఆరు నెలకొకసారి నిర్వహించే టెట్ పరీక్షలను గత ప్రభుత్వం నిర్వహించలేని.. దీని వల్ల నిరుద్యోగులకు తీరని నష్టం జరిగిందన్నారు. నాణ్యత కలిగిన విద్యని అందించేలా జాతీయ విద్యా విధానాన్ని స్టడీ చేస్తామని అన్నారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ రద్దుపై కేబినెట్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ పేరు చెబితేనే భూ యజమానులు తమపై పిడుగుపాటు బాధకు గురైయారని చెప్పుకొచ్చారు. నీతి ఆయోగ్ ప్రతిపాదించిన చట్టానికి.. గత ప్రభుత్వం తెచ్చిన చట్టానికి తీవ్ర వైరుధ్యాలున్నాయన్నారు. అలాంటి భయంకరమైన చట్టాన్ని రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. పెన్షన్లు పంపిణీ చేస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుందని .. 65.30 లక్షల మంది లబ్ధిదారులు ఉన్నారని వివరించారు. సచివాలయ సిబ్బందే ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు పంపిణీ చేపడతారని చెప్పుకొచ్చారు.

**పింఛన్ల పెంపు**

బకాయిలతో సహా రూ. 7 వేల పెన్షన్ ఇస్తున్నామని చెప్పారు. పెన్షన్ పెంపు వల్ల నెలకు రూ. 810 కోట్ల భారాన్ని భరిస్తున్నామని అన్నారు. ఏడాదికి రూ. 33,709 కోట్లు పెన్షన్ల నిమిత్తం పంపిణీ చేయబోతున్నామని తెలిపారు. దివ్యాంగులు, క్షయ వ్యాధిగ్రస్తులకు ఇస్తున్న పింఛన్ ను రూ. 3 వేల నుంచి రూ. 6 వేల రూపాయలకు పెంచడం జరిగిందని , అదే విధంగా పూర్తి అంగవైకల్యంతో బాధపడుతున్న దివ్యాంగులకు ఇస్తున్న రూ. 5 వేల పింఛన్ ను రూ. 15 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, కిడ్నీ, లివర్, బైలేట్రల్ ఎలిఫెంటాసిస్ వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ఇస్తున్న ఫించన్ ను రూ. 5 వేల నుంచి రూ. 10 వేల రూపాయలకు పెంచడం జరిగిందని, కిడ్నీ డయాలసిస్, సికిల్ సెల్ ఎనీమియా, తలసేమియా, హెచ్ఐవీ తదితర వ్యాధిగ్రస్తులకు పెన్షన్ పంపిణీ డీబీటీ ద్వారా జరుగుతుందని చెప్పారు. ఈ విధంగా సామాజిక భద్రతా పింఛన్ల పెంపుదల వల్ల ప్రభుత్వంపై నెలకు రూ. 819 కోట్ల రూపాయల అదనపు భారం పడుతుంది. ఏరియర్స్ తో కలిపి నెలకు రూ. 4,408 కోట్లు ప్రభుత్వం ఖర్చు చేయాల్సి ఉందని వెల్లడించారు.

స్కిల్ సెన్సస్ చేపడతామని చెప్పారు.

రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సెస్-2024 నిర్వహణకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది.

ఏ దేశమైనా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే నైపుణ్యం కలిగిన యువత ఎంతో అవసరం. అది గుర్తించిన సీఎం చంద్రబాబు నేతృత్వంలోని ప్రభుత్వం అందుకనుగుణంగా ఆంధ్రప్రదేశ్ నైపుణ్య సెన్సెస్-2024 నిర్వహణకు తొలి మంత్రి మండలిలోనే ఆమోదం తెలియజేసింది. ప్రతి

2 లో

## మెగా డీఎస్సీ విధివిధానాల ఫైలుపై తొలి సంతకం చేసిన మంత్రి లోకేష్

- సచివాలయంలో మంత్రి నారా లోకేష్ బాధ్యతల స్వీకరణ!
- విద్యార్థి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధుల అభినందనలు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర మానవవనరులు, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ సచివాలయంలో సోమవారం నిరాడంబరంగా బాధ్యతలు స్వీకరించారు. వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ సచివాలయంలోకి అడుగుపెట్టిన లోకేష్.. 4వ బ్లాక్ ఫస్ట్ ఫ్లోర్ రూమ్ నంబర్ - 208 చాంబర్ లో బాధ్యతలు చేపట్టారు. మెగా డీఎస్సీ విధివిధానాలకు సంబంధించిన ఫైలుపై లోకేష్ తొలిసంతకం చేసి, కేబినెట్ కు పంపారు. పలువురు విద్యార్థి, ఉపాధ్యాయ సంఘ నాయకులు లోకేష్ ను కలిసి అభినందనలతో

2 లో

## డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో తెలుగు సినీ నిర్మాతల సమావేశం



**విజయవాడ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపి ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌తో తెలుగు సినీ నిర్మాతలు సమావేశమయ్యారు. సోమవారం ఉదయం హైదరాబాద్ నుంచి గన్నవరం విమానాశ్రయానికి చేరుకొన్న సినీ నిర్మాతలు.. అక్కడి నుంచి డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. అప్పుడే తొలి క్యాబినెట్ భేటీ ముగిసిన తర్వాత అక్కడికి చేరుకున్న పవన్‌తో సమావేశమయ్యారు. చిత్ర పరిశ్రమ సమస్యలు, రాష్ట్రంలో సినీరంగం విస్తరణకు ఉన్న అవకాశాలు, తదితర కీలక అంశాలపై చర్చించినట్లు తెలుస్తుంది. సినీ పరిశ్రమ ఇబ్బందులను పవన్‌కు నిర్మాతలు నివేదించారు. ఈ సమావేశంలో

2 లో

## పంచె కట్టు... తెలుగులో ప్రమాణం

### లోక్ సభలో ఆకట్టుకున్న తెలుగు ఎంపీలు

**( పొలిటికల్ డెస్క్ , జర్నలిస్ట్ ఫైల్ )** 18వ లోక్ సభ తొలి సమావేశాలు సోమవారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ నిర్వహించారు. ఈసందర్భంగా ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ రాష్ట్రాల ఎంపీలు తెలుగులో ప్రమాణం చేయడం విశేషం. తొలుత ఎన్డీయే మంత్రివర్గంలోని కేంద్రమంత్రులు జి. కిషన్ రెడ్డి ( బీజేపీ ), కింజరాపు రామ్మోహన్ నాయుడు ( టీడీపీ ), పెమ్మసాని చంద్రశేఖర్ ( టీడీపీ ), బండి సంజయ్ ( బీజేపీ ), భూపతిరాజు శ్రీనివాసవర్మ ( బీజేపీ ) తెలుగులో ప్రమాణస్వీకారం చేశారు. మంత్రిమండలి సభ్యుల ప్రమాణం పూర్తయిన తర్వాత ఆంగ్ల అక్షరమాల క్రమం ప్రకారం రాష్ట్రాలకు చెందిన ఎంపీలు ప్రమాణం చేశారు.

తొలుత ఏపీ ఎంపీలకు అవకాశం రాగా.. అందులోనూ కొందరు



ఎంపీలు తెలుగులో ప్రమాణం చేశారు. వీరిలో మతుకుమిల్లి శ్రీభరత్, కలిశెట్టి అప్పలనాయుడు, దగ్గుబాటి పురందేశ్వరి, వల్లభనేని బాలశౌరి, కేశినేని శివనాథ్ (చిన్ని), లావు శ్రీకృష్ణ దేవరాయలు ఉన్నారు. మిగతావారు హిందీ, ఇంగ్లీష్‌లో ప్రమాణం చేశారు. ఇక, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, టీడీపీ ఎంపీ అప్పలనాయుడు తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా పంచెకట్టులో తొలిరోజు సభకు హాజరయ్యారు. అంతకుముందు కలిశెట్టి సైకిల్ పై పార్లమెంట్ కు రావడం విశేషం.

## ఇక అమరావతి పునర్నిర్మాణం వేగవంతం ..

- నిర్మాణ రంగ సంస్థలతో సీఎం చంద్రబాబు సమావేశం



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీ రాజధాని అమరావతి పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం సత్వర నిర్ణయాలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా గతంలో రాజధాని నిర్మాణ పనుల్లో భాగస్వాములైన నిర్మాణ కంపెనీల ప్రతినిధులతో సీఎం చంద్రబాబు సమావేశమయ్యారు. టెండర్ల కాలపరిమితి ముగియడంతో నిలిచిన పనులను కొనసాగించే విషయంలో ఎలా ముందుకెళ్లాలనే అంశాలపై ఆయా కంపెనీలతో చర్చిస్తున్నారు. ఈ సమావేశంలో మంత్రి నారాయణ, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. గత ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట అమరావతిని నిర్లక్ష్యం చేసింది. దీంతో నిర్మాణ పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాంట్రాక్ట్ కంపెనీలు నిర్మాణం కోసం తీసుకొచ్చిన పరికరాలను తరలించేశాయి. దీంతో పూర్తయిన భవనాలు ముళ్లపొదలతో నిండిపోయాయి. మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రాజధాని పునర్నిర్మాణం కోసం నిర్మాణ రంగ కంపెనీలతో సీఎం సమీక్ష నిర్వహించడం కీలక ప్రాధాన్యత సంతరించుకుంది.

# మెగా డీఎస్సీ విధివిధానాల ఫైలుపై తొలి సంతకం చేసిన మంత్రి లోకేష్

(మొదటి పేజీ తరువాయి)

ముంచెత్తారు. బాధ్యతల స్వీకరణ సందర్భంగా మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, వంగలపూడి అనిత ఎస్.సవిత, టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీలు గల్లా జయదేవ్, కనకమేడల రవీంద్ర కుమార్, శాసనసభ్యులు పల్లా శ్రీనివాసరావు, బోండా ఉమామహేశ్వరరావు, భాష్యం ప్రవీణ్, నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీలు పరుచూరి అశోక్ బాబు, వేపాడ చిరంజీవి, కంచర్ల శ్రీకాంత్, భూమిరెడ్డి రాంభూపాల్ రెడ్డి, టీడీపీ ఎన్ఆర్ఐ విభాగం కోఆర్డినేటర్ వేమూరి రవికుమార్, అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాష్, తెలుగుయువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు, ప్రధాన కార్యదర్శి రవినాయుడు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ప్రణవ్ గోపాల్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం, మాజీ ఎమ్మెల్సీలు వైవీబీ రాజేంద్రప్రసాద్, ఏఎస్ రామకృష్ణ, బుద్ధా నాగ జగదీష్, అంగర రామ్మోహన్ రావు, పోలీస్ హౌసింగ్ కార్పోరేషన్ మాజీ ఛైర్మన్ నాగుల్ మీరా తదితరులు లోకేష్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

# డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో తెలుగు సినీ నిర్మాతల సమావేశం

(మొదటి పేజీ తరువాయి)

సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ కూడా ఉన్నారు. పవన్‌ను కలిసిన వారిలో ప్రముఖ నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, డి.సురేశ్ బాబు, ఏఎం రత్నం, ఎస్.రాధాకృష్ణ, దిల్ రాజు, ఎన్వీ ప్రసాద్, భోగవల్లి ప్రసాద్, డీవీవీ దానయ్య, సుప్రియ, బన్ని వాసు, నాగవంశీ, వంశీకృష్ణ, రవిశంకర్, నవీన్ యర్నేని తదితరులు ఉన్నారు.

# నేను ఆత్మహత్యాయత్నం చేయలేదు : మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్



**విశాఖపట్నం (జర్నలిస్ట్ ఫైల్):** తాను ఆత్మహత్యాయత్నం చేయలేదని పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అదీప్ రాజ్ స్పష్టం చేశారు. నిద్రమాత్రలు మింగి అదీప్ రాజ్ ఆత్మహత్యాయత్నం చేశారంటూ వస్తున్న వార్తల నేపథ్యంలో సోమవారం అదీప్ రాజ్ స్పష్టతనిచ్చారు. తనకు కడుపునొప్పి వచ్చి ఆసుపత్రికి వెళ్లానని, చికిత్స అనంతరం డాక్టర్లు డిశ్చార్జ్ చేశారని తెలిపారు. అదీప్ రాజ్ కు ఫుడ్ పాయిజన్ అయ్యిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

# ప్రొద్దుటూరులో దారుణహత్య




**ప్రొద్దుటూరు (జర్నలిస్ట్ ఫైల్) :** ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలో ఉన్న మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి ఇంటి ఎదురుగా సోమవారం దారుణహత్య జరిగింది. భూమిరెడ్డి రామచంద్రారెడ్డి అనే వ్యక్తి వెంకట మహేశ్వర్ రెడ్డి అనే వ్యక్తిని హత్య చేసి శవాన్ని మాయం చేశాడు. మృతుడి తల్లి నాగరత్నమ్మ, రామచంద్రా రెడ్డి కొంతకాలంగా సహజీవనం చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈరోజు తెల్లవారేసరికి వెంకట మహేశ్వర్ రెడ్డి గదిలోనూ మంచంపై రక్తపు మరకలు ఉండటంతో మృతుడి తల్లి పోలీసులను ఆశ్రయించింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# జగన్ తోనే ఉంటా : ఎంపీ మిథున్ రెడ్డి



**పొలిటికల్ డెస్క్ (జర్నలిస్ట్ ఫైల్ ):** ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఘోరం ఓడిపోయింది. 175 అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసిన ఆ పార్టీ 164 చోట్ల ఓటమి పాలయ్యారు. 25 పార్లమెంట్ సీట్లలో పోటీ చేసిన ఆ పార్టీ అభ్యర్థులు నలుగురే గెలిచారు. దీంతో ముగ్గురు ఎంపీలు బీజేపీలో చేరబోతున్నారని, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి కమలం నేతలతో టచ్లో ఉన్నారని జమ్మలమడుగు బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి తెలిపారు. దీంతో స్పందించిన మిథున్ రెడ్డి.. తనకు బీజేపీలో చేరాల్సిన ఖర్మ పట్టలేదన్నారు. వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తనను సొంత తమ్ముడిలా చూసుకుంటున్నప్పుడు వేరే పార్టీ వైపు చూడాల్సిన అవసరం ఏముందన్నారు. తాను బీజేపీలో చేరాతానని ప్రతిపక్ష నాయకులు మైండ్ గేమ్ ఆగుతున్నారని, ఎవరూ నమ్మవద్దని చెప్పారు. రాష్ట్రప్రయోజనాల కోసం బిల్లులు పెడితే ఎన్డీయే కూటమికి మద్దతు తెలుపుతామని వెల్లడించారు. రాష్ట్రానికి వ్యతిరేకంగా ఉంటే కచ్చితంగా సపోర్ట్ చేయమని ఎంపీ మిథున్ రెడ్డి పేర్కొన్నారు.

# కాకినాడ వైసీపీ కార్యాలయానికి నోటీసులు



**కాకినాడ (జర్నలిస్ట్ ఫైల్) :** కాకినాడ జిల్లా ప్రతినిధి: కాకినాడ పైడా వారి వీధిలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న రెండు ఎకరాల భూమిలో వైసీపీ కార్యాలయాన్ని కాకినాడ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు ఆధ్వర్యంలో నిర్మించారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ కార్యాలయాల నిర్మాణాలు అక్రమ కట్టడాలుగా తేలింది. దీంతో కాకినాడ వైసీపీ కార్యాలయానికి కార్పొరేషన్ అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ అక్రమ నిర్మాణాలకు వారం రోజుల్లోపు సమాధానం చెప్పాలని, పార్టీ జిల్లా అధ్యక్షుడు కన్నబాబుకు నోటీసులు జారీ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న నిర్మాణాన్ని తక్షణమే నిలిపివేయాలని, ఎందుకు తొలిగించకూడదో వారం రోజుల్లో వివరణ ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేశారు.

# జి ఓ 117ను రద్దు చేయాలి: ఆప్టా



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత చర్యల వల్ల మన రాష్ట్రం లో ప్రాథమిక విద్య కుంటుపడిందని ,ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు సంఖ్య తగ్గటమే కాకుండా చాలా మంది బాల బాలికలు పాఠశాల విద్యకు దూరం అయ్యారని ఆంధ్ర ప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) రాష్ట్ర అధ్యక్షుడు ఏ జి ఎస్ గణపతి రావు, ప్రధాన కార్యదర్శి కాకి ప్రకాశ్ రావు, సహాధ్యక్షుడు ఎం.జి. మెహది ఏ ఆంధ్ర ప్రదేశ్ మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేష్ ను , పాఠశాల విద్యా ముఖ్య కార్యదర్శి కోనా శశిధర్ ను రాష్ట్ర సచివాలయం లో కలిసి వారికి సమర్పించిన లేఖలో వివరించారు.

ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ వహించి మన రాష్ట్రం లో ప్రాథమిక విద్యను అభివృద్ధి పదంలోకి తేవాలని ఆ శాఖను తన తనయుడు మానవ వనరుల శాఖ మంత్రి లోకేష్ కు కేటాయించారని వారు పేర్కొన్నారు . పాఠశాల విద్యను మెరుగు పరిచేందుకు తమ సంఘం పక్షాన కొన్ని సూచనలను నారా లోకేష్ కు, ముఖ్య కార్యదర్శి కు అందజేశారు,

జి.ఓ 117ను తక్షణమే రద్దు చేసి ఉన్నతపాఠశాల లో కలిపిన 3,4,5 తరగతులను తిరిగి వెంటనే పాత పాఠశాల ల కు కలపాలి అని, .ప్రతి పాఠశాల లో తెలుగు మీడియం మరియు ఇంగ్లీష్ మీడియం ను కొనసాగించాలి అని, తల్లికి వందనం ద్వారా చెల్లించే ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ పాఠశాల లో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మాత్రమే అందించాలి అని, ఉపాధ్యాయ విద్యార్థి ల నిష్పత్తి ప్రాథమిక పాఠశాల లో 1:20 గా పాత పద్ధతిలో కొనసాగించాలి అని, ఉన్నత పాఠశాల యందు తెలుగు మరియు ఇంగ్లీష్ మీడియంలో పోస్టులను భర్తీ చేయాలి అని కోరారు. పై సూచనలకు మంత్రి . ప్రిన్సిపాల్ సెక్రటరీ సానుకూలంగా స్పందించడం జరిగింది అని తెలిపారు

# ప్రజా ప్రభుత్వంతో ప్రజలకు భరోసా

(మొదటి పేజీ తరువాయి)

సంవత్సరం రాష్ట్రంలో 310 ఇంజినీరింగ్ కాలేజీలు, 1400 డిగ్రీ కాలేజీలు, 267 పాలిటెక్నిక్ కాలేజీలు, 516 ఐటీఐ కాలేజీ ల నుండి దాదాపు 4.4 లక్షల యువత ఆయా కోర్సులను పూర్తి చేసుకొని బయటకు వస్తున్నారు. అయితే డిమాండ్, సప్లై మరియు అందుబాటులో ఉన్న సదుపాయాల ఆధారంగా స్కిల్ గ్యాప్ ను అంచనా వేయడం, ప్రస్తుత, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మన యువతను జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పోటీ పడేలా చేసి ప్రపంచ యవనిక పై మన ముద్ర ఉండేలా తీర్చిదిద్దాల్సిన అవసరం ఎంతైనా ఉంది అని రాష్ట్రప్రభుత్వం గుర్తించింది. యువతకు నైపుణ్య అవసరాలు అలాగే పారిశ్రామిక అనుబంధ సంస్థలు, వ్యవసాయ రంగం, మార్కెటింగ్ సంస్థలు, ప్రొడక్షన్ సంస్థలు వారి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఆయా సంస్థల అవసరాలకు అనుగుణంగా నైపుణ్య సర్వేని 3 నుంచి 4 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని మంత్రి మండలి నిర్ణయించింది. ఈ సెన్సెస్ లో అందుబాటులో ఉన్న స్కిల్ ప్రొఫైల్స్, స్కిల్ నీడ్స్, స్కిల్ ఇన్ డిమాండ్, స్కిల్ లభ్యత మధ్య అంతరాన్ని గుర్తించడం, అంచనా వేయడం, తదనుగుణంగా నైపుణ్యాభివృద్ధి శిక్షణలు డిజైన్ చేసేలా ప్రభుత్వానికి సమాచారం అందించడం, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువత సదరు నైపుణ్యాలను సాధించేలా శిక్షణ అందించడం ఈ సెన్సెస్ ముఖ్య లక్ష్యాలు. అంతిమంగా మన రాష్ట్ర యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించడమే ప్రభుత్వ సంకల్పం అని మంత్రి పార్థసారథి తెలిపారు

**పేదోడి కేడుపు నింపేందుకు అన్నే క్యాంటీన్ల పునఃప్రారంభం**

గత ప్రభుత్వం అన్నా క్యాంటీన్లను కక్షపూరితంగా మూసివేసి నిరుపేదల నోటి దగ్గర ముద్ద తీసేసింది. పేదవాడి ఆకలి దప్పులను తీర్చేందుకు సీఎంగా చంద్రబాబు నాయుడు బాధ్యతలు స్వీకరించిన రోజునే అన్నా క్యాంటీన్ లను పునరుద్ధరిస్తూ సంతకం పెట్టారు. ఆ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 203 అన్నా క్యాంటీన్లను పున: ప్రారంభించేందుకు చర్యలు తీసుకోనున్నారు. తొలి దశలో 183 అన్నా క్యాంటీన్లను ఒకేసారి ప్రారంభించాలని కేబినెట్ నిర్ణయం తీసుకుంది. మిగిలిన 20 క్యాంటీన్లను కూడా తదుపరి దశలో ప్రారంభించాలని నిర్ణయించింది. ఈ అన్నాక్యాంటీన్ ల ద్వారా పేద అన్నార్తులకు ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి భోజనం సబ్సిడీ ధరకే అందించడం జరుగుతుంది.

అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభిస్తున్నామని అన్నారు. పౌష్టికాహారాన్ని పేదలకు రూ. 5కే అందిస్తున్నామని తెలిపారు. మొత్తంగా 203 అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం మూసేసిందన్నారు. వీటిల్లో 183 క్యాంటీన్లను త్వరలో ప్రారంభించబోతున్నామని.. మిగిలిన 20 క్యాంటీన్లను తర్వాత ప్రారంభిస్తామని మంత్రి పార్థసారథి తెలిపారు.

**హెల్త్ యూనివర్శిటీకి తిరిగి ఎన్టీఆర్ పేరు**

హెల్త్ యూనివర్శిటీకి తిరిగి ఎన్టీఆర్ పేరు పెడుతూ కేబినెట్లో నిర్ణయం తీసుకున్నామని ప్రకటించారు. 1986లో నాటి రాష్ట్ర ప్రభుత్వం ఒక చట్టం ద్వారా ఆంధ్రప్రదేశ్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ను ఏర్పాటు చేసింది. 1998లో ఈ చట్టానికి సవరణ చేసి అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ గా నామకరణం చేసింది. అనంతరం 2006లో డా.ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ గా మార్పు చేసింది. 2022లో ఈ యూనివర్సిటీ పేరును గత ప్రభుత్వం డా.వైయస్సార్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ గా మార్చింది.ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఆ చట్టాన్ని సవరిస్తూ స్వర్గీయ డా. నందమూరి తారక రామారావు గారు ప్రజలకు చేసిన సేవలకు గుర్తింపుగా యూనివర్సిటీకి ఆయన పేరుతో పునర్ నామకరణం చేయాలన్న ప్రతిపాదనకు మండలి ఆమోదం తెలిపింది. విదేశాలకు వెళ్ళే వైద్య విద్యార్థులకు కళాశాల పేరు మారడం వలన సాంకేతిక పరమైన సమస్యలు ఎదుర్కొంటున్న కారణంగా తిరిగి అదే పేరును పునరుద్ధరించేందుకు నిర్ణయించడం జరిగింది అని మంత్రి చెప్పారు.

**ఇతర అంశాలు:** దమ్మాలపాటి శ్రీనివాసును ఏజీగా కేబినెట్ ఆమోదించిందని తెలిపారు. గంజాయి నివారణకు ఐదుగురు సభ్యులతో కేబినెట్ సబ్ కమిటీ వేసిందన్నారు. పంచాయతీ, మున్సిపాల్టీల్లో పారిశుద్ధ్య పనులను వెంటనే ప్రారంభించాలని , అధ్వానంగా మారిన రోడ్లు, రహదారులు గతుకులమయం అయినందున వెంటనే పాట్ హోల్స్ ను పూడ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని ఆర్ అండ్ బీకి ఆదేశాలు జారీ చేసేందుకు మంత్రి మండలి ఆదేశించదన్నారు. ఈ నెలాఖరు నుంచి ఏడు శ్వేత పత్రాలను విడుదల చేయబోతున్నామని స్పష్టం చేశారు. పోలవరం, అమరావతి, విద్యుత్, పర్యావరణం, శాంతి భద్రతలు, మద్యం, శాండ్ అండ్ మైన్ వంటి వాటిపై శ్వేతపత్రాలు విడుదల చేస్తామని కొలుసు పార్థసారథి తెలిపారు.

# నూతన డీజీపీ తిరుమలరావుకు ‘ ఏపీ జేఏసీ అమరావతి’ శుభాకాంక్షలు

- **రాష్ట్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వానికి ‘ఏపి జెఏసి అమరావతి’ పూర్తి మద్దతు .**



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** నూతన డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన .సి.హెచ్.ద్వారకా తిరుమల రావు ను బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని ఏపి జెఏసి అమరావతి రాష్ట్ర కమిటీ , పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాస రావు మరియు అనుబంధ సంఘాల నేతలు సోమవారం మర్యాదపూర్వకంగా కలసి ఏపీ జేఏసీ అమరావతి పక్షాన శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా ఏపిజెఏసి అమరావతి చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లులు,సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు,అసోషియేట్ చైర్మన్ టి.వి.ఫణి పేర్రాజు, కోశాధికారి వి.వి.మురళికృష్ణ నాయుడు మాట్లాడుతూ ఉద్యోగులపై ప్రధానంగా మహిళా ఉద్యోగుల పట్ల పని ప్రదేశాల్లో ల జరిగే వేధింపులపై ఫిర్యాదులు వస్తే... వెంటనే చర్యలు తీసుకోవాలని, తద్వారా మహిళా ఉద్యోగులు ఆత్మస్థైర్యంతో విధులు నిర్వహించుకొనే పరిస్థితులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై డిజిపి సానుకులంగా స్పందించారు.

ఈ కార్యక్రమంలో ఏపిజెఏసి అమరావతిలో ఉన్న అనుబంధ సంఘాల రాష్ట్రనాయకులు ప్రధానంగా రాష్ట్ర పోలీసు అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జనకుల శ్రీనివాస రావు మరియు వారి కార్యవర్గ సభ్యులు, రాష్ట్ర హెూం గార్డ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు యస్.గోవిందు మరియు వారి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,ఏపి ప్రభుత్వ డ్రైవర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సంసాని శ్రీనివాసరావు,ఏపీ నాలుగో తరగతి ఎంప్లాయీస్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షులు యస్. మల్లేశ్వరరావు, ఏపీ జెఏసి అమరావతి మహిళా విభాగం చైర్ పర్సన్ శ్రీమతి పారే లక్ష్మి, సెక్రటరీ జనరల్ పొన్నూరు విజయలక్ష్మి, మున్సిపల్ ఉద్యోగుల సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈశ్వర్ దోప్పలపూడి, ఎన్టీఆర్ జిల్లా జేఏసీ అమరావతి చైర్మన్ బత్తిన రామకృష్ణ, గుంటూరు జిల్లా జేఏసీ అమరావతి చైర్మన్ కే.సంగీతరావు, రెవెన్యూ అసోసియేషన్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాస్, తధితరులు పాల్గొన్నారు.

# గృహనిర్మాణ శాఖలో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలి



**పొన్నూరు (జర్నలిస్ట్ ఫైల్):** గృహ నిర్మాణ శాఖలో అవకతవకలపై సమగ్ర విచారణ జరపాలని పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ ఆదేశించారు. సోమవారం సాయంత్రం మండల పరిషత్, రెవెన్యూశాఖ ఇతర శాఖల సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నరేంద్ర క ుమార్ మాట్లాడుతూ ఎన్నికల ముందు హడావిడిగా సచివాలయల్లో చేసిన రిజిస్ట్రేషన్ వివరాలు సపరేట్ గా నివేదిక ఇవ్వాలని తహసిల్దార్ ను ఆదేశించారు. ఇళ్ల నిర్మాణానికి ఏజెన్సీలకు ఏ ప్రాతిపదికన కాంట్రాక్ట్ ఇచ్చారని ఆయన ప్రశ్నించారు. లబ్ధిదారుల తీర్మానాలు, కాంట్రాక్టర్ ఒప్పందాలు తెలియచేయాలని ఆయన కోరారు. లబ్ధిదారులు, కాంట్రాక్టర్ల మధ్య ఒప్పందం చేయటంలో గృహనిర్మాణ శాఖకు ఉన్న ఆసక్తి ఏమిటని ఆయన ప్రశ్నించారు. పరోక్షంగా కాంట్రాక్టర్లకు మద్దతునిస్తూవారి దోపిడీకి సహకరిస్తున్నారా ..అని నరేంద్ర కుమార్ హౌసింగ్ శాఖ అధికారులను నిలదీశారు. అవినీతికి దూరంగా ఉండాలని, ప్రోత్సహించే వారిని క్షమించేది లేదన్నారు. అవినీతి, మాఫియాలతో వచ్చిన చెడ్డ పేరు పోయే విధంగా పని చేయాలని కోరారు. అన్ని శాఖలను సంస్కరించి దిద్దుబాట చర్యలు చేపడతామన్నారు.దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ప్రజలు కోరుకున్న మార్పును అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గ్రీవెన్స్ లో వచ్చిన వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వ మత్తులో నుంచి అధికారులు బయటకు రావాలని ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ హితవు పలికారు. అనంతరం ఎమ్మెల్యే నరేంద్ర కుమార్ ను సచివాలయ సిబ్బంది దుశ్శాలువ, పూలమాలలతో ఘనంగా సత్కరించారు .ఈ సమావేశంలో ఎంపీపీ భవనం పద్మలీల, ఎంపీడీవో రత్నజ్యోతి,తహసిల్దార్ సూర్యనారాయణ సింగ్, హౌసింగ్ డీఈఈ మోహన్ రావు, ఆర్డబ్ల్యూఎస్ డీఈఈ అబ్దుల్ మతిన్, పి ఐ యు డీఈఈ సాంబశివరావు, డిఎల్పిఓ స్వరూపారాణి, ఎలక్ట్రిసిటీ శ్రీనివాసరావు తదితరులు మాట్లాడారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మళ్ళీ మంచి రోజులు వస్తాయి : వైఎస్ జగన్



(మొదటి పేజీ తరువాయి)

కష్టసుఖాలను తెలుసుకున్నారు. అలాగే.. పార్టీ ప్రజాప్రతినిధులు, మాజీ నేతలతో కూడా చర్చించారు. కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్యపడవద్దు. పార్టీ అండగా ఉంటుందని, అందరం కలిసి కట్టుగా ముందుకు వెళ్ళాల్సిన అవసరం ఉంది. రానున్న కాలంలో ప్రతీ కార్యకర్తకు పార్టీ తోడుగా ఉంటుంది” అని జగన్ భరోసానిచ్చారు. అలాగే.. కష్టకాలంలో పార్టీ కార్యకర్తలకు, నేతలకు అండగా నిలబడాలని ప్రజాప్రతినిధులకు జగన్ సూచించారు. పులివెందుల పట్టణంలో అనారోగ్యంతో మృతి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు సంకిరెడ్డి భౌతిక కాయానికి వైఎస్ జగన్ నివాళులర్పించారు. ఆయనతో పాటు ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి, ఇతర నాయకులు నివాళులర్పించారు. పులివెందులలో ఇటీవల మృతి చెందిన సమీప బంధువు మైఖేల్ కుటుంబాన్ని వైఎస్ జగన్ పరామర్శించారు. మూడు రోజుల పాటు పులివెందుల పర్యటన ముగించుకున్న జగన్... సోమవారం ముగిసాయి. హెలికాప్టర్‌లో బెంగుళూరుకు వెళ్లారు.

# అక్రమంగా నిర్మిస్తున్న శారదాపీఠం నిర్మాణాలను కూల్చేయాలని జనసేన డిమాండ్



**తిరుపతి (జర్నలిస్ట్ ఫైల్ ):** గత ప్రభుత్వం హయాంలో తిరుమలలో అక్రమంగా మఠాలు వెలిశాయని, వాటిని తొలగించాలని తిరుపతి జనసేన డిమాండ్ చేస్తోంది. తిరుమలలోని శారదాపీఠం నిర్మాణాలను జనసేన నేత కిరణ్ రాయల్ అధ్వర్యంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కిరణ్ రాయల్ మాట్లాడుతూ తిరుమలలో శారదాపీఠానికి వైసీపీ ప్రభుత్వం విచ్చలవిడిగా అనుమతులు ఇచ్చిందని మండిపడ్డారు. మఠాల అక్రమ కట్టడాలను నేలమట్టం చేయాలని డిమాండ్ చేశారు. మఠాల పేరుతో కోట్ల రూపాయల మేర కుంభకోణం జరిగిందని ఆరోపించారు. మఠాల అక్రమ కట్టాలపై టీటీడీ అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. తిరుమల ప్రక్షాళన మఠాల నుంచే జరగాలని సూచించారు. తిరుమలలో అక్రమంగా నిర్మించిన శారదా పీఠం మఠాలపై మంగళవారం టీటీడీ అధికారులకు ఫిర్యాదు చేస్తామని కిరణ్ రాయల్ స్పష్టం చేశారు.

## చంద్రన్న బీమా రూ.10 లక్షలకు పెంపు మంత్రి సుభాష్



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇంతకు ముందు ఉన్న పథకాల్లో చాలా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. తాజాగా చంద్రన్న బీమా పరిహారాన్ని పెంచుతున్నట్లు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. ఇంతకు ముందు ఇది రూ.3 లక్షలు ఉండగా.. ఇప్పుడు దానిని 10 లక్షలకు పెంచుతున్నట్లు మంత్రి సుభాష్ తెలిపారు.

అతి త్వరలోనే పాత్రికేయులు, న్యాయవాదుల్ని కూడా ఈ బీమా చేర్చేందుకు యోచిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం ఈ పథకం పేరు మార్చడంతో పాటు ఎంతోమందికి పరిహారాన్ని నిలిపివేసిందన్ని విమర్శించారు. కార్మికులు కార్మికశాఖలో రూ.15 కట్టి ఈ పథకంలో చేరొచ్చని మంత్రి తెలిపారు. ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల పరిహారం అందుతుందని అధికారులు పేర్కొన్నారు.

# స్వస్థలానికి చేరుకున్న సీజీజీబీ ముటుకూరు శాఖ



**దుర్గి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** దుర్గి మండలం ముటుకూరు గ్రామానికి చెందిన చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ముటుకూరు శాఖ సోమవారం నుంచి తమ సొంత గూటికి చేరుకొని ఖాతాదారులకు సేవలందించనుంది. కొన్ని సంవత్సరాల క్రితం అనివార్య కారణాల వల్ల చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ముటుకూరు శాఖ అక్కడి నుండి మాచర్లకు, కొంతకాలం తర్వాత దుర్గికి తరలించడం జరిగింది. అక్కడి నుండే ఖాతాదారులకు సేవలు అందించడం జరిగింది. ఈ నేపథ్యంలో ముటుకూరు గ్రామం నందు రాజకీయంగా మరియు సామాజికంగా సానుకూల వాతావరణం ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా బ్యాంకు ను తిరిగి ముటుకూరుకు తరలించడం జరిగింది. ముటుకూరులో నూతన హంగులతో నిర్మించినటువంటి నూతన భవనానికి తరలించారు. ఈ కార్యక్రమానికి చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కే. ప్రమోద్ కుమార్ రెడ్డి, పాలకమండలి సభ్యులు బి.వి.రమణారావు, జనరల్ మేనేజర్ పి.మారుతి రామ్, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ పి.వీరారెడ్డి మరియు చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్ ముటుకూరు శాఖ మేనేజర్ జి.బాలకృష్ణ ముటుకూరు గ్రామ పెద్దలు, పలువురు రాజకీయ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

కారంపూడి: అసెంబ్లీలో జరిగిన మాచర్ల నియోజకవర్గం శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి ప్రమాణ స్వీకారానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ , ఇందిరా నగర్ కాలనీలో ఉన్న అంగన్వాడి స్కూలు, ప్రాథమిక పాఠశాల నందు పలకలు, పెన్నులు, పెన్సిల్, చకుమరల్లు, బలపాలు, చిన్న పిల్లలకు అందజేశారు . కారంపూడి పట్టణంలోని తెలుగుదేశం పార్టీ నాయకులు కటికల బాలకృష్ణ ఈ కార్యక్రమానికి ముందడుగు వేసి శుభాకాంక్షలు తెలియజేశారు

# తెలంగాణ వార్తలు

## కాంగ్రెస్‌లో చేరిన మరో ఎమ్మెల్యే



**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీ జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరారు. సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో ఎమ్మెల్యే సంజయ్ కలిశారు. సంజయ్ కి కండువా కప్పిన సీఎం రేవంత్.. పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కాగా రెండు రోజుల క్రితం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి కూడా కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే.

## విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కమిషనర్‌గా ఏవీ రంగనాథ్



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** మల్టీ జోన్ -1 ఐజీగా ఉన్న ఏవీ రంగనాథ్‌కు తెలంగాణ ప్రభుత్వం కీలక బాధ్యతలను అప్పగించింది. ఇప్పటి దాకా హైదరాబాద్ జీహెచ్ఎంసీ పరిధికి పరిమితమైన విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, డిజాస్టర్ మేనేజ్మెంట్ పోస్టును అప్‌గ్రేడ్ చేసి హెచ్ఎండీఏ పరిధికి విస్తరిస్తూ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ మేరకు సోమవారం జీవో జారీ చేసింది.

ఇప్పటివరకు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న అక్రమ కట్టడాలు, నాళాల ఆక్రమణలు.. చెరువుల ఆక్రమణలన్నీ సమూలంగా నిర్మూలించే స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఇన్‌చార్జిగా రంగనాథ్‌కు ప్రభుత్వం బాధ్యతలను అప్పగించింది. ఈ విభాగం ముఖ్యమంత్రి ఆధీనంలో ఉండనుంది. కాగా, కమాండ్ కంట్రోల్ రూమ్ (బంజారా హిల్స్ ) కేంద్రంగా స్పెషల్ టాస్క్ ఫోర్స్ ఆఫీస్ ఏర్పాటు కానున్నట్టు సమాచారం. ఇక.. హెచ్ఎండీఏ పరిధిలో కబ్జాల మీద ఉక్కుపాదం మోపే బాధ్యత ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఐజీ రంగనాథ్ చేపట్టనున్నారు.

## ఫిరాయింపులపై బీఆర్ఎస్ మాట్లాడుతుంటే నవ్వు వస్తోంది: షబ్బీర్ అలీ



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్) :** పార్టీ ఫిరాయింపులపై బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే నవ్వు వస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత , ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. సోమవారం ఆయన గాంధీభవన్‌లో మీడియతో మాట్లాడుతూ.. భట్టి విక్రమార్కకు ప్రతిపక్ష నేత హోదా లేకుండా చేసింది కేసీఆర్ కాదా? అని ప్రశ్నించారు. శాసనమండలిలో కూడా తన ప్రతిపక్ష నేత హోదా తొలగించలేదా? అని నిలదీశారు. తమ పార్టీ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలను బీఆర్ఎస్‌లో చేర్చుకోలేదా? అని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో 8 సీట్లలో డిపాజిట్ పోయిందని, ఇప్పుడు అనర్హత వేటు గురించి మట్లాడుతున్నారని షబ్బీర్ అలీ ఎద్దేవా చేశారు.

## చరిత్ర పునరావృతం అవుతుంది : కేటీఆర్ కీలక వ్యాఖ్యలు



**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పార్టీని వీడుతున్న తరుణంలో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు స్పందించారు. అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎప్పుడూ బలంగా ఉంటుందని అన్నారు. గతంలో ప్రజా ఉద్యమం ఉద్ధృతంతో తెలంగాణ గట్టిగా ప్రతిస్పందించిందని గుర్తు చేశారు. ఇప్పుడు అదే చరిత్ర పునరావృతం అవుతుందని ట్వీట్‌లో పేర్కొన్నారు.

**ప్రజల శక్తే బలంగా ఉంటుంది.. :** సాధారణంగా అధికారంలో ఉన్నవారి కంటే ప్రజల శక్తి ఎల్లప్పుడూ బలంగా ఉంటుందని బీఆర్ఎస్ నేత కేటీఆర్ అన్నారు. 2004 నుంచి 2006 మధ్య కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎన్నో ఫిరాయింపులు జరిగాయని ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో ప్రజా ఉద్యమం ఉద్ధృతం చేయడం ద్వారా తెలంగాణ గట్టిగా ప్రతి స్పందించిందని స్పష్టం చేశారు. అప్పుడు కాంగ్రెస్ పార్టీ తలవంచక తప్పలేదని గుర్తు చేశారు. అదే చరిత్ర ఇప్పుడు పునరావృతం అవుతుందని ట్వీట్‌లో పేర్కొన్నారు. తాజాగా బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటున్న వేళ ఈ మేరకు కేటీఆర్ ఎక్స్ వేదికగా స్పందించారు.

# 44 మంది ఐఏఎస్‌ల బదిలీలు

**హైదరాబాద్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలంగాణ ప్రభుత్వం మరోసారి ఐఏఎస్ ల బదిలీల ప్రక్రియను చేపట్టింది. ఈనెల 15వ తేదీనే అన్ని జిల్లాలకు కలెక్టర్లను మార్చిన ప్రభుత్వం.. తాజాగా మరోసారి ఐఏఎస్ లను బదిలీ చేసింది. 44 మంది ఐఏఎస్ అధికారులను బదిలీ చేస్తూ జీఓ జారీ చేసింది ప్రభుత్వం.

ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిగా సందీప్ సుల్తానియాను నియమించగా, పశు సంవర్ధక శాఖ ముఖ్య కార్యదర్శిగా సవ్యసాచి ఘోష్కు అవకాశం కల్పించింది. సంజయ్ కుమార్‌కు కార్మిక, ఉపాధి శిక్షణ శాఖ ముఖ్య కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించింది.

యువజన సర్వీసులు, పర్యాటక, క్రీడల శాఖ ముఖ్య కార్యదర్శిగా వాణి ప్రసాద్‌ను నియమించగా, చేనేత, హస్త కళల ముఖ్య కార్యదర్శిగా శైలజా రామయ్యను నియమించింది. హ్యాండ్లూమ్స్, టీజీసీవో హ్యాండ్‌క్రాఫ్ట్స్ ఎండీగా శైలజకు అదనపు బాధ్యతలు అప్పగించింది. అహ్మద్ నదీమ్ అటవీ, పర్యావరణ శాఖలతో పాటుగా టీపీటీఆర్ఐ డీజీగా అదనపు బాధ్యతలు ఇచ్చింది. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ ముఖ్య కార్యదర్శిగా రిజ్వీ, జీఏడీ ముఖ్య కార్యదర్శిగా సుదర్శన్ రెడ్డికి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలువరించింది. జ్యోతి బుద్ధప్రసాద్కు హౌసింగ్, రిజిస్ట్రేషన్లు, స్టాంపుల శాఖ ముఖ్య కార్యదర్శిగా అవకాశం కల్పించిన తెలంగాణ ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఎండీగా సోనీ బాలాదేవిని నియమించింది. రవాణా శాఖ కమిషనర్‌గా కె. ఇలంబరితి కొనసాగను న్నారు. విద్యుత్ శాఖ కార్యదర్శి రొనాల్డ్ రోస్కు జెన్‌కో, ట్రాన్స్‌కో అదనపు బాధ్యతలను అప్పగించింది.

**జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఆమ్రపాలి :** శ్రీదేవసేనను కళాశాల, సాంకేతిక విద్యాశాఖల కమిషనర్‌గా కొనసాగించింది. హెచ్ఎండీఏ కమిషనర్‌గా సర్ఫరాజ్ అహ్మద్, సెర్ప్ సీఈవోగా ఉన్న డి. దివ్యకు ప్రజావాణి నోడల్ అధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఆమ్రపాలికి జీహెచ్ఎంసీ కమిషనర్‌గా అదనపు బాధ్యతలను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. హరిచందనను రోడ్లు, భవనాల శాఖ ప్రత్యేక కార్యదర్శిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

ఎన్. ప్రకాష్‌రెడ్డి పర్యాటక అభివృద్ధి సంస్థ ఎండీగా నియమించింది. ఎస్సీ గురుకులాల కార్యదర్శిగా అలగ్‌వర్షిణి, గృహనిర్మాణశాఖ ప్రత్యేక కార్యదర్శి వి. పి. గౌతమ్‌కు పురపాలక శాఖ డైరెక్టర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఉపాధి, శిక్షణ శాఖల డైరెక్టర్‌గా కృష్ణా ఆదిత్యకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జలమండలి ఎండీగా కె. అశోక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా అనురాగ్ జయంతిని నియమించారు. ఐటీ ఉపకార్యదర్శిగా భవేష్ మిశ్రాను నియమించగా, కాలుష్య నియంత్రణ మండలి కార్యదర్శిగా జి. రవికి బాధ్యతలు అప్పగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ ఫలితాలు విడుదల

**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల ఫలితాలను ఇంటర్ బోర్డు అధికారులు విడుదల చేశారు. ఇవాళ మధ్యాహ్నం ఇంటర్ బోర్డు అధికారులు ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు విడుదల చేశారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలకు సంబంధించి బోర్డు అధికారులు కసరత్తు పూర్తి చేశారు. ఇప్పటికే మూల్యాంకాన ప్రక్రియ పూర్తయ్యింది. సాంకేతికపరమైన అంశాలను పరిశీలన సైతం పూర్తవ్వడంతో ఇవాళ మధ్యహ్నాం 2గంటలకు విడుదల చేశారు.

ఇంటర్ ప్రథమ సంవత్సరం, ద్వితీయ సంవత్సరం పరీక్షల ఫలితాలు ఒకేసారి విడుదలయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలకు హాజరైన విద్యార్థులతో పాటు ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంప్రూవ్‌మెంట్ పరీక్షలకు హాజరైన విద్యార్థుల మార్కులను కూడా విడుదల చేశారు. ఇంటర్ బోర్డు అధికారిక వెబ్‌సైట్‌తో పాటు ఇతర వెబ్‌సైట్లలో ఫలితాలు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులు తమ హాల్ టికెట్ నంబర్ , ఇతర వివరాలను నమోదు చేయడం ద్వారా తమ ఫలితాలను చూసుకోవచ్చు. ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలకోసం www://tg-bie.cgg.gov.in, https://results.cgg. gov.in వెబ్‌సైట్లను ఉపయోగించుకోవాలని సూచించారు. అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షకు దాదాపు నాలుగున్నర లక్షల మంది విద్యార్థులు హాజరైనట్లు సమాచారం. వీరిలో పరీక్షల్లో ఫెయిలైనవారితో పాటు ఫస్టియర్‌లో ఇంప్రూవ్‌మెంట్ కోసం రాసిన విద్యార్థులూ ఉన్నారు

## కలెక్టరేట్ లో రైతు ఆత్మహత్యాయత్నం



**జనగామ (జర్నలిస్ట్ ఫైల్):** జనగామ కలెక్టరేట్ కార్యాలయంలో రైతు పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన సోమవారం కలెక్టరేట్ లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం. నిమ్మల నరసింగరావు (29) జనగామ మండలం పసరమడ్ల గ్రామానికి చెందిన యువరైతు కలెక్టరేట్ ప్రజావాణిలో తన భూమిని పట్టా చెయ్యాలని గతంలో పలుమార్లు ప్రజావాణిలో వినతి చేశారని.. అయినా అధికారులు పట్టించుకోలేదని మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డారు.

సోమవారం కూడా ప్రజావాణిలో తన భూమి పట్టా చేయాలని కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారని కలెక్టరేట్ కార్యాలయంపైకి ఎక్కి బ్యానర్ కట్టి మరీ రైతు పురుగుల మందు సేవించడంతో కలకలం రేపింది. దీంతో హుటాహుటిన పోలీసులు ఆ రైతును కిందకి దింపి చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఏది ఏమైనా ప్రతి ప్రజావాణిలో భూ ధరణి సమస్యలపై పలుమార్లు ఫిర్యాదులు వచ్చినా పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని పలువురు పేర్కొన్నారు.

## తెలుగులో ప్రమాణం చేసిన కిషన్ రెడ్డి



**న్యూఢిల్లీ:** 18వ లోక్‌సభ తొలి సమావేశాలు కొనసాగుతున్నాయి. సభ్యులతో ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ప్రమాణం స్వీకారం చేయిస్తున్నారు. తొలుత ప్రధాని మోదీ ఎంపీగా ప్రమాణం చేశారు. అనంతరం కేంద్రమంత్రులు, ఇతర సభ్యులతో ప్రమాణం చేయిస్తున్నారు. ఈక్రమంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలుగులో ప్రమాణం చేశారు.

తొలిరోజు 280 మంది ఎంపీలు ప్రమాణం చేయనున్నారు. మిగిలిన వారు మంగళవారం ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం స్పీకర్ ఎన్నికకు నామినేషన్ కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఈ నెల 26న స్పీకర్ ఎన్నిక పూర్తవుతుంది. 27న రాజ్యసభ కూడా ప్రారంభమవుతుంది. అదే రోజు ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రసంగించనున్నారు.

## సంజయ్ కాంగ్రెస్‌లో చేరడం అనైతికం



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కాంగ్రెస్ పార్టీలో చేరడం పెద్ద ఎత్తున రచ్చకు కారణమవుతోంది. సంజయ్ చేరికపై కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు ఆందోళనలకు దిగాయి. అధిష్టానంపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఆయనను ప్రభుత్వ విప్పులు ఆది శ్రీనివాస్, లక్ష్మణ్ బుజ్జగిస్తున్నారు. మరోవైపు బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యే సంజయ్ కుమార్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ రాజీనామా చేయాలని బీఆర్ఎస్ నేత కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌లో సంజయ్ చేరికపై ఎమ్మెల్సీ ఎల్ రమణ స్పందించారు. ఆయన కాంగ్రెస్‌లో చేరడం అనైతికమని అన్నారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు పడేలా చట్టం తెస్తామని రాహుల్ గాంధీ ఎన్నికల ప్రచారంలో చెప్పారని ఎల్ రమణ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో రాహుల్ గాంధీ మాటకు విలువ లేదా? అని ప్రశ్నించారు. తెలంగాణలో ఉన్నది రేవంత్ కాంగ్రెస్ పార్టీనా? లేక ఇందిరా కాంగ్రెసా? అని నిలదీశారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలకు స్వయంగా సీఎం రేవంత్ కండువా కప్పుతున్నారని.. ఇది నీతి మాలిన చర్య అని పేర్కొన్నారు. దీనికి రాహుల్ గాంధీ ఏం సమాధానం చెబుతారని రమణ ప్రశ్నించారు. చేనేత కార్మికుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలేనన్నారు. రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో చేనేతల ఆత్మహత్యల పై చర్చ జరగాలని ఎల్ రమణ డిమాండ్ చేశారు.

## రాజ్యాంగ ప్రతులతో విపక్షాల నిరసన.. బీజేపీపై తీవ్ర విమర్శలు



**ఢిల్లీ:** ఎన్డీయే సర్కార్ మూడో సారి అధికారం చేపట్టిన తరువాత సోమవారం తొలి పార్లమెంటు సమావేశాలు ప్రారంభమయ్యాయి. బీజేపీ ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ, పార్టీ జాతీయాధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, టీఎంసీ ఎంపీ సౌగతా రాయ్‌తో సహా ప్రతిపక్ష ఇండియా కూటమి నేతలు పార్లమెంటు ఆవరణలో నిరసనకు దిగారు. రాజ్యాంగ ప్రతులను చేతిలో పట్టుకుని, దానిని కాపాడాలంటూ నేతలు నినాదాలు చేశారు.

బీజేపీ రాజ్యాంగాన్ని అవమానిస్తోందని ఆరోపించారు. మల్లికార్జున్ ఖర్గే మాట్లాడుతూ.. 'మోదీజీ రాజ్యాంగాన్ని విచ్ఛిన్నం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అందుకే ఈరోజు అన్ని పార్టీల నేతలు ఒక్కతాటిపైకి వచ్చి నిరసనలు తెలుపుతున్నారు. బీజేపీ నేతలు గాంధీజీ సాక్షిగా ప్రజాస్వామ్యాన్ని బద్దలు కొడుతున్నారు. మనం రాజ్యాంగం ప్రకారం ముందుకెళ్లాలి. మోదీ.. ఎమర్జెన్సీ గురించి 100 సార్లు చెబుతారు. ఎమర్జెన్సీ విధించకుండానే ఆయన ప్రజల హక్కులను కాలరాస్తున్నారు. ఇలా ఇంకెంత కాలం పాలించాలనుకున్నారు" అని ఖర్గే ప్రశ్నించారు.

**రాజ్యాంగాన్ని ఉల్లంఘించారు..**

టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ.. రాజ్యాంగాన్ని ఉల్లంఘించి బీజేపీ.. ప్రొటెం స్పీకర్ నియామకం చేసిందని ఆరోపించారు. నిబంధనలను ఉల్లంఘించినందుకే నిరసన తెలుపుతున్నామని.. ప్రొటెం స్పీకర్‌ను నియమించిన తీరు రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. మోదీకి వ్యతిరేకంగా ఏకమవుతున్న తమ వెంట ప్రజలు ఉన్నారని.. రానున్న రోజుల్లో దేశ వ్యాప్త ఉద్యమాలు చేపడతామని స్పష్టం చేశారు.

## ఎమర్జెన్సీ విధించి రాజ్యాంగాన్ని ముక్కలు చేశారు.. కాంగ్రెస్‌పై మండిపడిన మోదీ



**ఢిల్లీ:** దేశంలో సరిగ్గా 50 ఏళ్ల కిందట ఎమర్జెన్సీ విధించి కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ముక్కలు చేసిందని ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. 18వ లోక్ సభ సమావేశాలు ప్రారంభం అయ్యాక మోదీ ప్రసంగించారు. రాజ్యాంగాన్ని ముక్కలు చేసి, దేశాన్ని జైలుగా మార్చిన ఎమర్జెన్సీ అనే మచ్చ ఏర్పడి రేపటికి 50 ఏళ్లు అవుతుందని ప్రధాని మోదీ విమర్శించారు.

50 ఏళ్లనాటి తప్పును పునరావృతం చేసే సాహసం మున్ముందు ఎవరూ చేయకుండా దేశ ప్రజలు సంకల్పం తీసుకుంటారని అన్నారు. ప్రజలకు నినాదాలు అవసరం లేదనీ, విధానాలు కావాలని, అందుకే విపక్షం బాధ్యతాయుతంగా పని చేయాలని మోదీ కోరారు. మూడో దఫాలో మూడు రెట్లు అధికంగా పనిచేస్తామని ఎంపీలు సహకరించాలన్నారు. సామాన్య ప్రజల ఆకాంక్షలకు తగినట్లు పనిచేయాలన్నారు.

**విపక్షాల నిరసనలు..**

ప్రధాని మోదీ వ్యాఖ్యలపై విపక్ష ఇండియా కూటమి నిరసనలు తెలిపింది. రాజ్యాంగం ప్రతులను పట్టుకుని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసింది. రాజ్యాంగాన్ని మోదీ సర్కారు కాలరాస్తోందని విపక్ష నేతలు విమర్శించారు.

రాజ్యాంగంపై ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా దాడులు చేస్తున్నారని, ఈ దాడులు ఆమోదయోగ్యం కావని ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలన్న తమ ప్రయత్నానికి ప్రజలు మద్దతు పలికారని కాంగ్రెస్ జాతీయాధ్యక్షుడు ఖర్గే స్పష్టం చేశారు.


## బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారు



**కోజికోడ్:** లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని న్యూస్‌క్లిక్ ఎడిటర్ ఇన్ చీఫ్ ప్రబీర్ పురకాయస్థ పేర్కొన్నారు. కేరళ ఎన్‌జిఒ యూనియన్ 61వ రాష్ట్ర సదస్సు ప్రతినిధి సమావేశాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారతదేశ ప్రజలు తమ స్వేచ్ఛను హరించడాన్ని, తమ గొంతుకలను అణచివేయడాన్ని సహించడానికి సిద్ధంగా లేరని చెప్పేందుకు ఈ ఎన్నికలు నిదర్శనమని అన్నారు. కాంగ్రెస్ లేదా మరే ఇతర పార్టీలు సాధించిన విజయం కాదని, బిజెపికి దేశ ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు. ప్రజల ప్రయోజనాలను విస్మరించారని, అందుకే బిజెపి చాలా చోట్ల విఫలమైందని అన్నారు. మత విభజన రాజకీయాలు అయోధ్యలోనూ విఫలమయ్యాయని చెప్పారు. భారతదేశం ఎదుర్కొంటున్న అసలైన సమస్యల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకు కేంద్రం మతవిద్వేషాలను, విభజన రాజకీయాలను తెరపైకి తీసుకువచ్చిందని అన్నారు. పోషకాహార లోపం, పేదరికం, శిశు మరణాల రేట్లు పెరిగాయని, దేశం బ్రిటిష్ రాజ్ మాదిరిగానే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ సారథ్యంలో అదానీ, అంబానీలు బిలియనీర్‌లుగా మారారని అన్నారు. అసలు గణాంకాలను కూడా కేంద్రం విడుదల చేయడం లేదని, ప్రణాళికా సంఘాన్ని రద్దు చేశారని అన్నారు. ప్రజలకు సమాచారం చేరకుండా నల్ల చట్టాలను ప్రవేశపెట్టారు. గళం విప్పిన వారిని దేశద్రోహులుగా పేర్కొంటూ జైళ్లలో పెట్టారు. దీని కోసం అన్ని కేంద్ర దర్యాప్తు ఏజెన్సీలను వినియోగించారని దుయ్యబట్టారు. బడా పెట్టుబడిదారుల నుంచి నిధులు సేకరించేందుకు ఎలక్టోరల్ బాండ్లను ప్రవేశపెట్టారని మండిపడ్డారు. ఈ రోజుల్లో డిజిటల్ మీడియా చాలా కీలకంగా మారిందని, ప్రజాస్వామ్య మనుగడ కోసం ప్రజలు డిజిటల్ మీడియాలో భాగస్వామ్యం కావాల్సి వుందని ఉద్ఘాటించారు. డిజిటల్ మీడియా, రైతు ఉద్యమం వంటివి ప్రభుత్వ ప్రధాన మీడియా స్రవంతిని సవాలు చేశాయని గుర్తు చేశారు. ప్రకటించని ఎమర్జెన్సీ సమయంలో ప్రధాన మీడియా ప్రజల అసమ్మతిని తప్పుగా చూపించిందని, నిరసనలను ట్రాఫిక్ అంతరాయాలుగా చిత్రీకరించిందని అన్నారు.

# జాతీయ వార్తలు

## నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారం



**న్యూఢిల్లీ:** 18వ లోక్‌సభ తొలిసమావేశాలు సోమవారం ఉదయం ప్రారంభమయ్యాయి. మొదటి రెండు రోజులు కొత్తగా ఎన్నికైన ఎంపీలు ప్రమాణ స్వీకారం చేస్తారు. 26వ తేదీన స్పీకర్ ఎన్నిక నిర్వహిస్తారు. 27వ తేదీన పార్లమెంట్ ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ప్రొటెం స్పీకర్ భర్తృహరి మహతాబ్ ఎంపీలతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్నారు. తొలుత వారణాసి ఎంపీగా ఎన్నికైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రమాణ స్వీకారంచేశారు. మోదీ ప్రమాణం చేస్తుండగా సభ హర్షద్వానాలతో దద్దరిల్లింది. ఆ తరువాత రాధా మోహన్ సింగ్, రాజ్‌నాథ్ సింగ్ , అమిత్ షా , నితిన్ గడ్కరీ , శివరాజ్‌సింగ్ చౌహాన్ ఎంపీలుగా ప్రమాణ స్వీకారం చేశారు.. మంత్రులు ఎంపీలుగా ప్రమాణ స్వీకారం తరువాత రాష్ట్రాల వారీగా అక్షర క్రమంలో ఎంపీల ప్రమాణ స్వీకారం చేశారు.

## కొనసాగుతున్న ఢిల్లీ మంత్రి నిరాహారదీక్ష



**న్యూఢిల్లీ :** నీటి కొరతతో అల్లాడుతున్న ఢిల్లీకి నీటిని విడుదల చేయకుండా బ్యారేజీ గేట్లను హర్యానా ప్రభుత్వం మూసివేసిందని ఢిల్లీ మంత్రి అతిషి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఢిల్లీకి నీటి పంపిణీ విషయంలో కేంద్రం జోక్యం చేసుకోవాలంటూ అతిషి శుక్రవారం నుండి నిరాహార దీక్ష చేపడుతున్న సంగతి తెలిసిందే. సోమవారం నిరాహార దీక్ష నాలుగో రోజుకి చేరుకుంది. హత్నికుండ్ బ్యారేజీలో అదనపు నీరు ఉన్నప్పటికీ.. హర్యానా ప్రభుత్వం 28 లక్షల మంది ప్రజలను కష్టాల్లోకి నెట్టిందన్నారు. ఢిల్లీకి చట్టపరమైన వాటా వచ్చే వరకు సమ్మె కొనసాగుతుందని అతిషి స్పష్టం చేశారు.

## కేజ్రీవాల్ బెయిల్ పిటిషన్ విచారణ వాయిదా



**ఢిల్లీ:** దిల్లీ లిక్కర్ స్కాం కేసులో రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన మధ్యంతర బెయిల్‌పై దిల్లీ హైకోర్టు స్టే విధించడాన్ని సీఎం అరవింద్ కేజ్రీవాల్ సుప్రీం కోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం పరిశీలించింది. ఈ పిటిషన్‌పై విచారణను జూన్ 26వ తేదీకి(బుధవారం) వాయిదా వేసింది. ఈ సందర్భంగా కోర్టులో ఇరుపక్షాల నడుమ వాడివేడిగా వాదోపవాదనలు జరిగాయి. కేజ్రీవాల్ తరఫున సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వీ వాదిస్తూ, బెయిల్ ఆర్డర్‌పై మధ్యంతర స్టేను తొలగించాలని కోరారు. ఈడీ తరఫున హాజరైన ఏఎస్‌జీ ఎస్వీ రాజు, కేజ్రీవాల్ అభ్యర్థనను వ్యతిరేకించారు. కేజ్రీవాల్‌కు ట్రయల్ కోర్టు ఇచ్చిన బెయిల్‌పై స్టే విధించాలని తాము దాఖలు చేసిన పిటిషన్‌పై దిల్లీ హైకోర్టు తుది తీర్పు వెలువరించనుందని తెలిపారు. ఇక ఈ అంశంపై హైకోర్టు ఉత్తర్వులు వెలువడే వరకు వేచి చూడాలని న్యాయమూర్తులు జస్టిస్ మనోజ్ మిశ్రా, జస్టిస్ ఎస్వీఎన్ భట్టితో కూడిన సుప్రీంకోర్టు వెకేషన్ బెంచ్ పేర్కొంది. తుది ఆదేశాలను హైకోర్టు వెలువరించాల్సి ఉన్న తరుణంలో తాము కలుగజేసుకొని ఉత్తర్వులు ఇవ్వడం అనేది న్యాయసమ్మతం కాదని స్పష్టం చేసింది. ఈ పిటిషన్‌పై విచారణను బుధవారానికి వాయిదా వేసింది.

## గవర్నర్ కార్యదర్శిగా హరి జవహర్‌లాల్ బాధ్యతలు స్వీకరణ



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఏపి గవర్నర్ కార్యదర్శిగా ఎం.హరి జవహర్‌లాల్ సోమవారం రాజ్‌భవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బదిలీ అయిన గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ స్థానంలో గవర్నర్ కార్యదర్శిగా డా.హరి జవహర్‌లాల్ నియమితులయ్యారు. తొలుత రాజ్‌భవన్‌కు చేరుకున్న డా.హరి జవహర్‌లాల్‌కు గవర్నర్ సంయుక్త కార్యదర్శి పి.ఎస్.సూర్యప్రకాష్, ఉప కార్యదర్శి పి.నారాయణ స్వామి, గవర్నర్ ఎడిసిలు మేజర్ దీపక్ శర్మ, ఎన్‌వి.రామాంజనేయులు స్వాగతం పలికారు. అనంతరం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం అర్చకులు డాక్టర్ హరి జవహర్‌లాల్‌కు ఆశీర్వచనం అందజేశారు. రాజ్‌భవన్ అధికారులు, సిబ్బంది డాక్టర్ హరి జవహర్‌లాల్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

## ప్రైవేటు విద్యా సంస్థలలో 25 శాతం ఉచిత సీట్ల జీవోను రద్దు చేసిన హైకోర్టు




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** విద్యా హక్కు చట్టంలో భాగంగా ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్లు కల్పించాలంటూ గత ప్రభుత్వం జారీ చేసిన జీవోను రద్దు చేస్తూ ఏపీ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. 2022-23, 2023-24 విద్యా సంవత్సరాలకు గాను ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలలో 25 శాతం ఉచిత సీట్లు కల్పించాలన్న గత ప్రభుత్వ జీవోలపై దాఖలైన పిటిషన్లను విచారించిన హైకోర్టు ప్రభుత్వ నిర్ణయాన్ని తొందరపాటు చర్యగా అభివర్ణించింది.
తూర్పుగోదావరి జిల్లా ప్రైవేట్ పాఠశాలల అసోసియేషన్, ఇస్మా సంయుక్తంగా వేసిన పిటిషన్లపై నేడు విచారణ జరిపిన న్యాయస్థానం ఈ మేరకు తీర్పు వెలువరించింది. రాష్ట్ర విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో పరిగణనలోకి తీసుకుని వ్యవహరించాలని ఈ సందర్భంగా ప్రభుత్వానికి సూచించింది. పిటిషనర్ తరపున మతుకుమిల్లి శ్రీవిజయ్ వాదనలు వినిపించారు.

## రావి సురేష్ రెడ్డి, ఏసిపి భాస్కర్ రావులను డిస్మిస్ చేయాలి

- అక్రమ కేసులు బనాయించి రాజ్యాంగాన్ని,చట్ట ఉల్లంఘనకు పాల్పడిన అధికారులను డిస్మిస్ చేయాలి
- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** అధికార దుర్వినియోగానికి పాల్పడి చట్టానికి విరుద్ధంగా ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్ కె.ఆర్. సూర్యనారాయణను నిరాధార ఆరోపణలు మోపి, అక్రమంగా కేసులు బనాయించి వేధించిన అధికారులను,వారి కుటుంబం ను మానసిక వెదకు గురి చేసిన రావి సురేష్ రెడ్డి, ఏసిపి భాస్కర్ రావులను డిస్మిస్ చేయాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష ,కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావులు ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ సంఘ నాయకుడుగా ఉద్యోగుల పక్షాన
ఉద్యోగుల జిపిఎఫ్ అకౌంట్లో మాయమైన 500 కోట్ల డబ్బుల మతలబు గురించి, సిపిఎస్ పై ఉద్యోగులకు ఇచ్చిన హామీ గురించి ,ఉద్యోగులకు ఒకటో తారీఖున జీతాలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రథమ పౌరుడు గవర్నర్ కు వినతి పత్రం సమర్పించడం ప్రజాస్వామ్యం కల్పించిన హక్కు. తప్పులను ఎత్తి చూపినందుకు కె.ఆర్. సూర్యనారాయణ పై వ్యక్తిగతంగా కక్ష కట్టి వారిని, వారి కుటుంబాన్ని పలువురు అధికారులు వేధింపులకు గురి చేశారని తెలిపారు. నిరాధార ఆరోపణలు చేసి రాజ్యాంగ వ్యతిరేకంగా వ్యవహరించిన ఉన్నతాధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. వారిపై విచారణకు ఆదేశించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సుప్రీంకోర్టు రక్షణ కల్పించినప్పటికీ విచారణ పేరుతో పిలిపించి చంపేస్తామని బెదిరించడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటుగా అభివర్ణిస్తూ ఆ విధంగా ప్రవర్తించిన అధికారులను వెంటనే డిస్మిస్ చేయాలని కోరారు. ఈ విషయంలతో ఏమాత్రం సంబంధం లేని కె.ఆర్. సూర్యనారాయణ కుటుంబాన్ని మానసికంగా చిత్ర హింసకు గురి చేసిన,అధికార దుర్వినియోగానికి పాల్పడిన రావి సురేష్ రెడ్డి, భాస్కర్ రావు లను సర్వీస్ నుండి డిస్మిస్ చేయాలని కోరారు.

## బేగంపేట విమానాశ్రయానికి బాంబు బెదిరింపు మెయిల్..!

**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఇటీవల విమానాశ్రయాలకు ఫేక్ బాంబు బెదిరింపు కాల్స్, మెయిల్స్ ఎక్కువగా వస్తున్నాయి. తనిఖీల అనంతరం ఏమీలేదని గుర్తించిన అధికారులు హమ్మయ్యా.. అంటూ ఊపిరిపీల్చుకుంటున్నారు. ఇలాంటి కాల్స్, మెయిల్స్ పెడితే తగు చర్యలు తీసుకుంటామని కూడా హెచ్చరిస్తున్నారు. అయినప్పటికీ ఈరోజు నగరంలోని బేగంపేట విమానాశ్రయానికి బాంబు బెదిరింపు రావడంతో కలకలం రేగింది. విమానాశ్రయంలో బాంబు ఉందని హెచ్చరిస్తూ %ౌ% సోమవారం ఉదయం బేగంపేట ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ తనిఖీలు చేపట్టారు. ఎయిర్‌పోర్ట్ సహా పరిసర ప్రాంతాల్లో పరిశీలించి బాంబు లేదని గుర్తించారు. ఆ తరువాత సదరు మెయిల్ ఎవరు పంపారనే విషయంపై దర్యాప్తు చేపట్టినట్టు పోలీసులు తెలిపారు

# గనులు, ఎక్సైజ్ శాఖలు పూర్తి స్థాయిలో ప్రక్షాళన

## రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు & ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** గత ఐదేళ్ల కాలంలో పూర్తి స్థాయిలో నిర్లక్ష్యానికి గురైన గనులు, ఎక్సైజ్ శాఖలను పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేస్తామని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న అద్భుతమైన ఖనిజ సంపద వనరులను ప్రజా శ్రేయస్సు కోసం సద్వినియోగం చేస్తామన్నారు. సోమవారం ఉదయం అమరావతిలోని రాష్ట్ర సచివాలయం మూడో బ్లాక్ మొదటి అంతస్తులో ఆయనకు కేటాయించిన ఛాంబరులో వేదపండితుల మంత్రోత్సారణల మధ్య మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే 2022 వ సంవత్సరం నుంచి పెండింగ్ లో ఉన్న ఓఎన్జీసి పెట్రోలియం మైనింగ్ లీజు పునరుద్ధరణ ఫైల్ పై తొలి సంతకం చేశారు. పెట్రోలియం, నేచురల్ గ్యాస్ నిబంధనలు 1959 ప్రకారం కొన్ని షరతులకు లోబడి 2040 సంవత్సరం వం-కూ ఈ లైసెన్స్ పునరుద్ధరణ చేయడం జరుగుతుంది.
ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ద్వారా రాష్ట్రంలో ఏర్పడిన నూతన ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజలకు స్వచ్ఛమైన పరిపాలన అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో నూతన ఎక్సైజ్ విధానాన్ని రూపకల్పన చేసి, మద్యం లావాదేవీలు, డిస్టిలరీల నుంచి మద్యం పంపిణీ తదితర కార్యక్రమాలను



అత్యంత పారదర్శకంగా అమలు చేయడం జరుగుతుందన్నారు. అక్రమ ఇసుక రవాణాను నియంత్రించి, ప్రజావసరాల కనుగుణంగా ఇసుకను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.
అత్యంత కీలకమైన గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖలు తమకు కేటాయించడం ఒక గురుతర బాధ్యతగా భావిస్తూ, సమర్ధవంతంగా పని చేసి, వాటి ద్వారా రాష్ట్ర ఖజానాకు పెద్ద ఎత్తున ఆదాయం చేకూర్చడానికి శాయశక్తులా కృషి చేస్తానని ఆయన తెలిపారు. తమకు ఇటు వంటి కీలకమైన శాఖలు అప్పగించిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి, మచిలీపట్నం నియోజకవర్గ ప్రజానీకానికి, రాష్ట్ర ప్రజలకు శిరసాభివందనాలు చేస్తున్నట్లు తెలిపారు.
సోమవారం రాష్ట్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన కొల్లు రవీంద్ర ను రాష్ట్ర గృహ నిర్మాణ సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు గనుల శాఖ కార్యదర్శి డా. ఎన్. యువరాజ్, డైరక్టర్ మైన్స్ ప్రవీణ్ కుమార్, ఎక్సైజ్ కమిషనర్ వివేక్ యాదవ్, డైరెక్టర్ చేతన్ ఇతర అధికారులు, ఉద్యోగులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాలతో అభినందనలు తెలిపారు.

## జగన్ దోపిడీపై విచారణ జరపాలి: ఎమ్మెల్యే కూన రవికుమార్

**శ్రీకాకుళం ( జర్నలిస్ట్ ఫైల్ ):** గత ప్రభుత్వంలో రాష్ట్ర అభివృద్ధి అర్థాంతరంగా ఆగిపోయిందని ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆరోపించారు. సోమవారం రవికుమార్ మీడియాతో మాట్లాడుతూ %ౌ% గత ప్రభుత్వంలో నదుల అనుసంధానం సహా కనీసం రోడ్లు వేయలేక పోయారని విమర్శించారు. మాజీ మంత్రి సీదిరి వైసిపి కార్యాలయాల గురించి మాటాడుతున్నారని.. అభివృద్ధి గురించి మాట్లాడటం లేదని అన్నారు. జగన్ చేసింది అరాచకం, దోపిడీ అని అన్నారు. మంచి చేస్తే ఓటేయండి అన్నారు కానీ.. మంచి చేయలేదు కాబట్టే ప్రజలు తిరస్కరించారని అన్నారు. కనీసం పది కిలోమీటర్ల రోడ్డు కూడా వేయలేకపోయారని చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఇదొక గుణపాఠం అని అన్నారు. ప్రజలకు ఉన్న ప్రజాస్వామ్య హక్కులను కాలరాశారని ధ్వజమెత్తారు. జగన్‌మోహన్ రెడ్డి దోపిడీపై విచారణ చేపట్టాలని చంద్రబాబుతోపాటు కూటమి నేతలను కోరారు. లూటి చేయడానికే ఉత్తరాంధ్ర రాజధాని అన్నారని అన్నారు.
విశాఖ రుషికొండ ప్యాలెస్ లో ఒక్క బెడ్ రూం ఇరవై సెంట్లలో కట్టారని చెప్పారు. ప్రజల చీత్కారాన్ని



జగన్ గుర్తించాలన్నారు. ఓటమిని కూడా అంగీకరించడం లేదన్నారు. స్పీకర్ స్థానంలో కూర్చో పెట్టే సాంప్రదాయం కూడా పాటించలేదని చెప్పారు. జగన్ ఐదు లక్షల రూపాయల కోట్లు దోపిడీ చేశారని అన్నారు. పంచాయితీలలో నిధులు డైవర్ట్ చేశారని చెప్పారు. పంచాయితీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేసిన ద్వివేది మీద క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. తప్పు చేసిన అధికారులపై శాఖా పరమైన విచారణ చేయాలని కూన రవికుమార్ డిమాండ్ చేశారు.

## సైకిల్ పై పార్లమెంట్ కు వెళ్లిన ఎంపీ అప్పలనాయుడు



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** తెలుగుదేశం పార్టీకి చెందిన విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పల నాయుడు టీడీపీపై తన అభిమానాన్ని వినూత్నంగా చాటుకున్నాడు. తనకు టికెట్ ఇచ్చి ఎంపీగా గెలిపించిన టీడీపీ గుర్తు సైకిల్ పైనే పార్లమెంట్ కు వెళ్లారు. సోమవారం పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కావడం, ఎంపీల ప్రమాణ స్వీకారం నేపథ్యంలో ఎంపీ అప్పల నాయుడు కుటుంబంతో కలిసి ఢిల్లీకి వెళ్లారు.
ప్రభుత్వం తనకు కేటాయించిన అతిథిగృహంలో కుటుంబంతో కలిసి బస చేశారు. సోమవారం మధ్యాహ్నం ప్రమాణ స్వీకారం ఉండడంతో ఉదయమే ఆయన సైకిల్ పై పార్లమెంట్ కు బయలుదేరి వెళ్లారు. తొలుత తన తల్లికి పాదాభివందనం చేసి, కుటుంబ సభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. ఎంపీ అప్పల నాయుడు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఎచ్చెర్ల నియోజకవర్గానికి చెందిన పలువురు టీడీపీ నేతలు ఢిల్లీకి వెళ్లారు. సైకిల్ పై పార్లమెంట్ కు బయలుదేరిన ఎంపీ అప్పల నాయుడును ఇతర వాహనాల్లో వారంతా అనుసరించారు.

## సూర్యలంక బీచ్ లోకి పర్యాటకులను అనుమతించని పోలీసులు

**చీరాల ( జర్నలిస్ట్ ఫైల్ ):** రామాపురం, వాడరేవు సముద్రతీరంలో సముద్ర స్నానం కోసం దిగి పలువురు యువకులు వరుసగా అలల తాకిడికి గురై మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ విషాద ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. సూర్యలంక బీచ్‌కు వచ్చే పర్యాటకులను అనుమతించడం లేదు. సోమవారం ఉదయం నుంచే పర్యాటకులు సూర్యలంకకు రాకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. వచ్చిన పర్యాటకులను వెనక్కి పంపుతున్నారు. వాతావరణం పరిస్థితుల దృష్ట్యా సముద్రంలో సుడిగుండాలు ఏర్పడుతున్న నేపథ్యంలో బీచ్‌లకు పర్యాటకులను అనుమతించడం లేదని పోలీసు అధికారులు తెలిపారు.

**తీర ప్రాంతంలో భద్రతా చర్యలు చేపట్టిన పోలీసులు**

ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ఆదేశాల మేరకు డిఎస్పి బేతపూడి ప్రసాద్ ఆధ్వర్యంలో తీర ప్రాంతాలలో పోలీసులు భద్రతా చర్యలు చేపట్టారు. తీరంలో సముద్ర స్థానాలకు వచ్చే పర్యటకులకు అవగాహన కల్పిస్తూ తీరంలో పర్యటిస్తున్నారు. పర్యటకులంతా పోలీసులకు సహకరించి సురక్షితంగా సముద్ర స్నానాలు ముగించుకోవాలని కోరుతున్నారు. ఈ




సందర్భంగా రూరల్ సిఐ నిమ్మగడ్డ సత్యనారాయణ, ఎస్సైలు శివ కుమార్, సురేష్, సిబ్బందితో కలసి భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్నారు.

## మల్లన్న సేవలో తెలంగాణ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి ప్రియదర్శిని


**శ్రీశైలం (జర్నలిస్ట్ ఫైల్):** శ్రీశైల మల్లికార్జున స్వామి భ్రమరాంబ అమ్మవార్ల దర్శనార్థం న్యాయమూర్తి ప్రియదర్శిని కుటుంబసభ్యులతో శ్రీశైలం విచ్చేసిన సందర్భంగా ముందుగా ఆలయ మర్యాదల ప్రకారం శ్రీశైల దేవస్థానం ఈఓ పెద్ది రాజు ఏఈఓలు హరిదాసు, మోహన్, స్వాగతం పలకడం జరిగింది. అనంతరం స్వామి అమ్మ వార్లను ఆలయ రాజగోపురం ద్వారా ప్రత్యేక దర్శనం ద్వారా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుటుంబ సభ్యులు దర్శించుకోవడం జరిగింది. ప్రత్యేక దర్శనం అనంతరం ఆలయ సాంప్రదాయం ప్రకారం శేష వస్త్రాలు,లడ్డు ప్రసాదాలు, వేద పండితుల ఆశీర్వాదాలు అందించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన వెంట సహాయ కార్య నిర్వహణ అధికారి లు మరియు వేద పండితులు పలువురు అధికారులు పాల్గొనడం జరిగింది.

## నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాల గుర్తింపు రద్దు చేయాలి

- కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** 2014 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విడిపోయిన తర్వాత నవ్యాంధ్రప్రదేశ్ లో 25% శాశ్వత ప్రభుత్వ ఉపాధ్యాయుల సభ్యత్వం లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ గుర్తింపు పొందిన మరియు అక్రమంగా దొడ్డిదారిన గుర్తింపు పొందిన అన్ని ఉపాధ్యాయ సంఘాల ప్రభుత్వ గుర్తింపు ను పునఃసమీక్షించి నిబంధనలకు అనుగుణంగా లేని ఉపాధ్యాయ సంఘాల గుర్తింపును రద్దు చేయాలని మోడల్ స్కూల్స్ ప్రోగ్రెసివ్ టీచర్స్ అసోషియేషన్ ఏ.పి రాష్ట్ర అధ్యక్షులు కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు.
ఆయా వివిధ ప్రభుత్వ యాజమాన్యాల ఉపాధ్యాయులకు,ప్రైమరీ,సెకండరీ హైస్కూలు స్కూల్ టీచర్లకు, ఇంటర్, డిగ్రీ అధ్యాపకులకు, భాషాపండితులకు, పీఇటి-ఫిజికల్ డైరక్టర్లకు, స్కూల్ అసిస్టెంట్లకు,అలాగే సబ్జెక్టుల వారీగా ఉపాధ్యాయ సంఘాలు సమస్యలపై నిత్యం ప్రాతినిధ్యం చేస్తున్నాయని,ఈ సంఘాలలో ఆయా ఉపాధ్యాయ వర్గాలు సభ్యులుగా ఉన్నపుడు,గుర్తింపు పొందిన ఉపాధ్యాయ సంఘాలకు 25% శాశ్వత సభ్యత్వం ఎక్కడినుండి వచ్చాయో స్పష్టత రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన తెలియచేసారు.
నిబంధనలకు విరుద్ధంగా ఈ ఉపాధ్యాయ సంఘాలకు జారీ చేసిన ఒడి సౌకర్యాన్ని కూడా రద్దు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.
అలాగే రిజష్టర్డ్ ఉపాధ్యాయ సంఘాలను ప్రభుత్వం నిర్వహించే ప్రతీ సమావేశాలకు ఆహ్వానం పంపించాలని ఆయన కోరారు

## చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్‌గా సుమిత్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



**చిత్తూరు (జర్నలిస్ట్ ఫైల్):** చిత్తూరు జిల్లా సచివాలయంలోని కలెక్టర్ ఛాంబర్ వద్ద చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్ గా నియమితులైన సుమిత్ కుమార్ సోమవారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్ కి చేరుకున్న నూతన జిల్లా కలెక్టర్ కి కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారి వేద పండితులు మంత్రోచ్ఛారణలతో స్వాగతం పలకగా, డి ఆర్ ఓ బి.పుల్లయ్య, డ్వామా పిడి ఎన్.రాజశేఖర్, కలెక్టరేట్ ఏఓ వెంకటేశ్వర్లు, కాణిపాకం ఈఓ వెంకటేశు, రెవెన్యూ అసోసియేషన్ కలెక్టరేట్ యూనిట్ ప్రెసిడెంట్ పార్థసారథి, ఇతర సంబంధిత అధికారులు స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్ ఛాంబర్‌లో చిత్తూరు జిల్లా నూతన కలెక్టర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. పదవీ బాధ్యతలు స్వీకరించిన అనంతరం నూతన జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ గతంలో పశ్చిమ గోదావరి జిల్లాలో కలెక్టర్ విధులు నిర్వర్తించానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. తాగునీరు, భూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను పారదర్శకంగా అమలు చేస్తామని చెప్పారు.

## హత్య కేసులో నలుగురు అరెస్ట్

**తిరుపతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఈనెల 14న ఆటో నగర్ లో ముంగిలిపట్టుకు చెందిన మాధం ప్రసాద్ ను దారుణంగా గొంతు కోసి హత్య జరిగిన విషయం తెలిసిందే. ఈ హత్య కేసులో అలిపిరి పోలీసులు నలుగురిని నిందితులుగా గుర్తించారు. ఆటోనగర్ కు చెందిన కచ్చిలేటి వెంకటేష్, చైతన్యపురం కు చెందిన సుంకర కిరణ్ కుమార్, తమిళనాడు రాష్ట్రం కాంచీపురానికి చెందిన నీలకంఠంలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మరొకరు మైనర్ బాలుడు కావడంతో అతడిని జువైనల్ హోం కు తరలించే పనిలో అలిపిరి పోలీసులు నిమగమయ్యారు.

జర్నలిస్ట్ ఫైల్
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968
అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467